
అలనాటి కథ



# దారి తప్పిన బండి

కొప్పర్తి యజ్ఞన్న

"వదినా...!" అంటూ లోపలికి అడుగు పెడుతూ పైకి అనుకోకుండా దృష్టిని సారించాడు రామారావు.

"ఏం, రామం? ఏవొచ్చి పడింది?" మేడ మెట్లు దిగుతూ శారద క్షణమాత్రం రామారావు వైపు చూసి, ఆఖరి మెట్టు మీదికి వచ్చి నిలబడింది.

"నీకు చెప్పను. ముందు వదినకు చెప్పాలి" అంటూ రామారావు మేడ మెట్లెక్కబోతూండగా అతని చేతిలోని ఉత్తరం చూచి గభాల్న అతని చేతిని పట్టుకొంది యమపాశంలా! "దొరికావులే దొంగా!" అంటూ ఉత్తరాన్ని లాక్కోబోయింది కాని రామారావు ఆమెకు చిక్కనీయలేదు.

"పోనీ.. అందులో ముఖ్యమైనది.. ఏమైనా వుంటే చెప్పు" అని బతిమాలుకొంటున్న ముఖం పెట్టి పారిపోతున్న రామారావును చూచి అంది.

"జీవితం" అంటూ రామారావు వదిన గదిలోకి వెళ్లాడు.

మూడేళ్ల శ్యాముకు తల దువ్వుతూన్న వదిన నిర్మలను సమీపించి, "వదినా! ఉద్యోగం వచ్చింది. రాజమండ్రి ఆర్ట్సు కాలేజీలో. కాని వదినా, అది రాకపోతేనే బాగుండేది. నిన్ను వదిలి ఎలా వెళ్లగలను వదినా! చిన్నప్పటి నుంచీ తల్లి లేని లోటును తీర్చిన మాతృహృదయం ఎలా వుంటుందో నాకు రుచి చూపావు. ఈ ఇరవై మూడేళ్లూ నీ కొడుకులా పెంచావు. అలాంటి నిన్ను..."

"ఆగు నాయనా! ఇప్పుడు పెరిగి పెద్దవాడవయ్యావు. నీ జీవితాన్ని నీవు మోయగలిగే సామర్థ్యం నీకు వచ్చింది. ఈ బంధాలు, ఈ బంధువులూ మనిషికి ప్రపంచజ్ఞానం వచ్చేవరకే, తర్వాత ఎవరి బాధ వారు గుర్తించుకోవాలి. నేను వారం వారం ఉత్తరాలు రాస్తూ ఉంటాను. బెంగపెట్టుకోకు. హాయిగా కష్టాలు రాకుండా జీవించు" అని నిర్మల అంటూ ఉంటే రామారావుకు దుఃఖం ఆగింది కాదు. కళ్లలో నీళ్లు చూసి, "బాధపడకు రామం! ఇన్నేళ్లు వచ్చినా పసిపాపలా ఏడవటమేనా? నీకంత బెంగగా వుంటే శారదను పంపిస్తాను. వెళ్లగానే నీకక్కడ చాలా కష్టంగా ఉంటుంది. కాబట్టి కొన్నాళ్ల పాటు నీకు సహాయంగా ఉంటుంది" అని నిర్మల శారదను పిలిచింది.

శారద రామారావు వెళ్లిన తరువాత కుర్చీలో చతికిలబడింది. ఏమీ తోచడం లేదీ వాతావరణంలో. ఆలోచనల సుడిగుండాలు శారద మనస్సులో కలుగుతున్నాయి. బావ పుణ్యాన తన జీవితానికి ఒక తీరం కనిపించింది. తనంటే బావకు ఎంతో దయ, ఎంతో అనురాగం. ఒక్క తిండే కాక చీరెలు కొనిపెట్టాడు తనకు. ఒక్కటేమిటి ఏమడిగినా లేదని అనడు. సుగుణాలు మనిషి. నేర్పితే రావు, అవి పుట్టుకతో రావాలి. నూటికీ కోటికీ బావ లాంటి వ్యక్తి వుంటా డీ లోకంలో. కాని ఇన్నీ వున్నా ఏదో వెలితి కనిపిస్తూనే ఉంది. ఎదురుగా ఎండమావుల్లా ఏవో తనకు దూరంగా ఉండి బాధిస్తున్నాయి. ఇంటర్ వరకు చదివిన చదువు వలన కలిగిన జ్ఞానం వలన ఏవో మంచి మంచి ఇంగ్లీషు నవలలు చదువుతోంది. రోజూ బీచికి వెళుతుంది. ఎన్ని చేసినా ఏదో వెలితి... హృదయంలో ఖాళీ అలానే ఉంది.. తను ఆ రోజుల్లో ఇంటర్ చదువుతూన్నప్పుడు... తనూ, రామం రోజూ కలిసి కాలేజీకి వెళ్లేవారు బావ కారులో. సాయంత్రం కలిసే తిరిగి వచ్చేవారు. బీచికి రామం వస్తే అతనితో వెళ్లేది. లేకపోతే, ఒంటరిగానే వెళ్లేది. ఇప్పుడూ వెళ్తోంది, కాని అప్పటికి ఇప్పటికి అగాధమంత విభేదం ఉంది. ఎలాగైనా... అప్పటి ఆ విద్యార్థిని జీవితమే ఎంతో మధురంగా ఉండేది. రామం... రామం అంటే తనకు చాలా అభిమానం. ఎందుకంటే అతను కాలేజీ కుర్రాళ్లలా వెకిలిగా ప్రవర్తించేవాడు కాదు. తను

అతనితో ఏకాంతంగా అనేకసార్లు కలిసి వెళ్లిన సంఘటనలు చాలా ఉన్నాయి. కాని ఒక్కనాడు కూడా రామం నీచంగా ప్రవర్తించలేదు. అతని హృదయం అతి నిర్మలమైంది. అతని గుణాలను మెచ్చుకొని లోలోపల సంతోషించేది. ఎప్పుడైనా దిగులుగా ఉన్నప్పుడు అతనితో మాట్లాడితే ఆ భారం తగ్గినట్లుండేది. కొన్నాళ్లు అతని మనస్తత్వాన్ని పరిశీలించింది తను. కాని అతన్ని అర్థం చేసుకోవడంలో తను చాలావరకు విఫలమైంది. అతడు తన అంతర్గతమైన ప్రేమను పైకి వ్యక్తం చేయలేకపోతు న్నట్లనిపించేది. రామారావూ, తనూ చిన్నతనం నుంచీ కలసిమెలసి తిరిగేవారు. తల్లి మరణించినప్పటి నుంచి బావ రామారావును పోషిస్తున్నాడు. నిర్మలక్కయ్య తననూ, రామున్నీ సొంతబిడ్డల్లాగా పెంచింది. అందుకే రామునికి వదినంటే లోకంలో మిగిలినవారి కంటే అమితానురాగం, ఒక్క రోజు నిర్మలక్కయ్యను విడిచి ఉండలేదు. తనూ, రామం చాలా సోషల్‌గా ఉండేవారు. బావ కూడా మనుష్యులనూ, వారి నావరించిన పరిస్థితులనూ చక్కగా అర్థం చేసుకునే మనస్తత్వం కలవాడు. అందుకే తనీవిధంగా ఒక దరి చేరి స్వేచ్ఛగా విహరించగలుగుతోంది. ఒకరిని పోషిస్తున్నందుకు ప్రతిఫలం ఎప్పుడూ కోరడు బావ. తన మీద ఎప్పుడూ అధికారం చలాయించలేదు. ఇవి అతని గుణాలకు మరిన్ని మెరుగులు దిద్దాయి. బావ డాక్టరుగా ప్రాక్టీస్ పెట్టి అయిదు సంవత్సరాలు కావస్తోంది. ఊరిలో ప్రతివారికీ ఈయన వైద్యం అంటే చాలా గురి. అందులోనూ ఆయన మంచితనం, పేదవారి బాధలు తెలుసుకొని అప్పుడప్పుడు చేసే ఉచితసహాయం ఆయనకు మరింత పేరు తెచ్చిపెట్టాయి. నిర్మలక్కయ్య చాలా అదృష్టవంతురాలని అనుకొంటూ ఉండేది...

"శారదా!" అని అక్కయ్య పిలిచిన పిలుపు విని తన ఆలోచనలకు బ్రేకు వేసి మేడ మీదికి వెళ్లింది శారద.

"శారదా! మన రామునికి రాజమండ్రిలో ఉద్యోగమైంది. పాపం. ఇప్పటి నుంచీ బెంగ పెట్టుకున్నాడు. వెళ్లగానే అంతా కొత్తగా ఉంటుంది. సామానులూ అవీ సర్దడానికి నీవతనితో వెళ్లాలి. నీవుంటే కొంచెం బెంగ కూడా తగ్గుతుంది. రేపే ప్రయాణం" అంది నిర్మల శారదకేసి చూచి.

శారద రామారావు వైపు చూస్తోంది.

'ఏమంటావు?' అంటున్నాయి అతని కళ్లు.

దానికి ప్రత్యుత్తరంగా శారద

**ఈ కథను ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక 1.6.1955 సంచికలో ప్రచురించాము**

నవ్వింది కళ్లతో. "సరేలే అక్కయ్యా. మరి బావ ఏమంటాడో?" అంది సందేహంతో.

"ఆయన ఏమీ అనరు. మీకు తెలుసు కదూ ఆయన సంగతి! అన్నిటికీ 'ఊ' అనేరకం. నేను నచ్చచెప్తానులే" అన్నది.

"రామం, బాబూ, స్నానానికి లే! మీ అన్నయ్యగారు వచ్చే వేళైంది. నేను వంటపనులు ముగించుకొని రావాలి." అంటూ నిర్మల అక్కడి నుంచి వెళ్లిపోయింది.

000

"ఏం రామం! ఎలా వుంది ఉద్యోగం?" అంది శారద ఒకనాటి రాత్రి డాబా మీద పడక కుర్చీలో పడుకొని.

పక్కనే మరో కుర్చీలో పడుకొని కళ్లు మూసుకొని ఏదో ఆలోచిస్తున్న రామారావుకు ఆ మాటలు నిస్సారంగా తోచాయి. ఒకసారి కళ్లు తెరచి ఎదురుగా ఉన్న శారద వైపు చూశాడు. పున్నమినాటి చంద్రుడు చెట్ల సందులగుండా తొంగి చూస్తున్నాడు. ఆ వెన్నెల శారద బుగ్గపైబడి ఎంతో అందాన్ని ఇచ్చింది. పిల్లగాలులకు ఆమె ముంగురులు అటూ ఇటూ నృత్యం చేస్తున్నాయి. ఏదో కలలోని దృశ్యంలా, కథలోని సంఘటనగా ఫీల్ అవుతున్నాడు రామారావు.

"ఎలా ఉండాలో అలానే ఉంది!" అన్నాడు సహజంగా.

"అంటే నీ ఉద్దేశం?" అంది శారద సంభాషణ పెంచాలనే కుతూహలంతో.

"అంటే... ఒక చిన్న కీ బొమ్మలా రోజూ కాలేజీకి వెళ్లడం, అక్కడ నాలుగు ముక్కలు వాగడం, కీ అయిపోగానే ఇంటికి వచ్చి పడుకోవడం, ఇంతే కదూ జీవితం!"

"అంతే కాదు రామం జీవితం అంటే. అనుభవించగలిగితే మనకు ఆ జీవితమే చాలా సౌఖ్యాలు కూరుస్తుంది" అంది శారద తీక్షణంగా దృక్కుల్ని నక్షత్రాల పైకి కేంద్రీకరిస్తూ.

"... అని నేను కాదన్నానా, అనుభవించే యోగం లేనప్పుడు, విధి ప్రతికూలించినప్పుడు మనం చేసేదేముంది?" అన్నాడు రామారావు శారద వైపు చూస్తూ.

శారద ఏమీ మాట్లాడలేదు. కొంత సేపుండి కిందికి వెళ్లిపోయింది.

రామారావు కళ్లు మూసుకొని ఆలోచనల్లో నిమగ్నమయ్యాడు. అతని స్మృతిపథంలోకి వదిన వచ్చింది. రామారావు తిరిగి బాధకు గురై కళ్ల వెంబడి నీళ్లు ప్రవహించాయి. మాతృసమానురాలు వదినను చూడకుండా ఒక్క క్షణం బ్రతకలేని తాను, ఆమెకిప్పుడు చాలా దూరంలో ఉన్నాడు. కాని మరుక్షణమే వదిన స్థానంలో శారద వచ్చి నిలబడింది.


శారద... అచ్చంగా వదినలాగే ఉంటుంది. చిన్నతనం నుంచి ఎంతో ఆనందంతో, అర్థంకాని భావాలతో శారద చుట్టూ పరిభ్రమిస్తూ ఆమెను వీడేది కాదు తన హృదయం. శారదతో మైత్రి ఈ నాడు పరిపూర్ణమైన ఆకృతిని దాల్చింది. కాని ఆ విషయంలో తానెప్పుడూ శారదతో ప్రస్తావించలేదు. ఎటూ దారి తోచక అలాగే అవ్యక్తప్రణయంతోనే, కాలచక్రం తిరిగిపోతూంటే దానితోపాటు రామారావు కూడా తిరిగిపోతున్నాడు.

"రామం!" అని వెనకాల నుంచి మధురస్వరం, కలహంస కూజితంలా వినిపించింది రామారావుకు.

వెనక్కి తిరిగి చూశాడు. తను కూర్చొనివున్న కుర్చీ మీద చేతులాన్చి తనలోకి చూస్తూ వున్న శారద నవలోకిస్తూ "శారదా!" అన్నాడు నిర్మలంగా. ఒక్క సారి లేచి ఆమెను తన ఒడిలోకి తీసుకొని తల నిమురుతూ ఏదో మాట్లాడుతున్నాడు హృదయంతో. వారి హృదయాల్లో అంతవరకు నిద్రాణమై మూగవోయిన కోర్కెలు ఒక్క సారి మేల్కొని జ్యోత్స్నాస్రవంతిలో తేలుతూ ఏదో సంగీతాన్ని వినిపించాయి.

మరో నెల గడిచిపోయింది. ఇంటి దగ్గర నుంచి చంద్రశేఖరం ఉత్తరం రాశాడు. "వదిన జబ్బు తీవ్రంగా ఉంది. శారదను తీసుకొని త్వరగా రా"మ్మని అందులోని విషయాలు.

రామారావు వదినను తలచుకొని ఆ రాత్రి చాలా సేపు చైతన్యరహితుడుగా కూర్చుండి పోయాడు. రెండు వారాలు కాలేజీకి సెలవు పెట్టి మర్నాడు మెయిల్‌కు



శారదతో బయలుదేరి విశాఖపట్నం వెళ్లాడు.

ఇంటికి వెళ్లగానే చంద్రశేఖరం దిగులుగా అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు.

"ఎలా ఉంది అన్నయ్యా?" అన్నాడు రామారావు.

చంద్రశేఖరం శారదవైపు తిరిగి, "శారదా! నీవు అక్కయ్యదగ్గరకు వెళ్లు..." అంటూ రామారావును చూచి,

"ఒరేయి రాముా! నిన్న మొన్న 'రామం, రామం' అని ఒక్కటే కలవరింత, మిమ్మల్ని చూడాలని రమ్మని రాయమంది. నాకేమీ తోచడం లేదు. నా దగ్గర వున్న మందులన్నీ వాడాను. బజారు వెళ్తున్నా ఒక మందు కోసం. నీవు వదిన దగ్గర వుండు. ఇప్పుడే వస్తా"నంటూ చంద్రశేఖరం వెళ్లిపోయాడు.

రామారావు త్వరగా నిర్మల దగ్గరకు వెళ్లి మంచం మీద చిక్కి శల్యమైపోయిన వదినను ఒక్కసారి కళ్లారా చూచాడు. నిర్మల దగ్గడం విని రామారావు భయపడ్డాడు కాని ధైర్యాన్ని చిక్కబట్టుకొన్నాడు.

"బాబూ! రామం! వచ్చావా నాయనా! ఈ లోకం నుండి వెళ్లిపోయే ముందు నిన్నొకసారి చూడాలని వుంది తండ్రీ!" అంటూ లాలనగా రామారావు జుత్తు లోనికి చేతివేళ్లు పోనిచ్చి హీనస్వరంతో అంది నిర్మల.

"అదేమిటి వదినా అలా మాట్లాడుతావు? ఇంత చిన్నదానికి ఇంత నిస్పృహ చెందాలా వదినా!"

"ఇది చిన్న జబ్బనుకొన్నావా నాయనా? ఇప్పటికి నెల కావస్తోంది ఈ జబ్బు నన్నావరించి, ఇంకా వదిలేటట్లు లేదు."

"ఆ... అప్పుడే మీరెందుకు రాయలేదు? పాపం, బావ ఒక్కడూ ఎన్ని చేసుకోగలడు!" అంది శారద విచారంగా.


"ఏదో చిన్నదే త్వరగా పోతుందనుకొని వ్రాయలేదే. కాని ఇదేమో ప్రాణాల మీదికే..." అంటూ ఇక మాట్లాడలేక పక్కకు తిరిగి పడుకొంది.

"శారదా! టెంపరేచర్ నోట్ చేశావా?"

"ఆ, నూట మూడు వుంది."

రామారావు సావిట్లోకి వచ్చి కుర్చీలో కూర్చొని ఆలోచిస్తున్నాడు. నిర్మలను లేపి మందు తాగించాడు. శారద పక్కనే కూర్చొని విసురుతోంది.

చంద్రశేఖరం భార్య ముఖంలోకి చూచాడు. "అధైర్యపడకు నిర్మలా... తగ్గిపోతుంది" లోపల




తనకు భయంగా ఉన్న ఆమెను ధైర్యంతో ఉండమని అంటున్నాడు చంద్రశేఖరం. ఒక్కసారి నిర్మలకు దగ్గుతెర వచ్చి ఊపిరి సలపనీయలేదు.

ఆ రాత్రి అందరూ నిర్మల దగ్గర కూర్చొన్నారు. రామారావు భోజనం సంగతి పూర్తిగా మరిచి పోయాడు. శారద, శేఖరం ఏదో ఎంగిలిపడి వచ్చారు.

అయిదు గంటలు గడిచాయి.

నిర్మల మూల్గుతోంది. రామారావు పిచ్చివాడి వలే చూస్తున్నాడు.

"నాయనా... రామం... ఇంక బ్రతుకు క్షణాలలోకి వచ్చింది.... ఏమండీ... మీరీ... శారదను..." ఇక మాట్లాడలేకపోయింది.

శేఖరం, శారద రామారావు వైపు చూశారు. అతని కళ్లలో నీటి బిందువులు మెరుస్తున్నాయి.

కొన్ని క్షణాలు గడిచాయి. నిర్మల మూసిన కళ్లు తెరవలేదు.

"వదినా!" అంటూ ఒక పెనుకేక పెట్టాడు రామారావు.

ఆ ధ్వని అతని జీవితప్రాంగణం దద్దరిల్లేటట్లు ప్రతిధ్వనించి అణిగిపోయింది. అతని హృదయం వికలమై పోయింది.

శేఖరం తలను కిందికి దించేసుకొన్నాడు, విచారభారాన్ని మోయలేక.

రామం ఇదేమీ పట్టించుకోనట్లు నిశ్చలంగా నిద్రిస్తున్నాడు. శారద నిర్మల మంచం మీద వాలిపోయింది. రెండవ మాతృ హృదయం కూడా తనకు దగ్గర లేదని విలపించాడు రామారావు. కాలేజీకి వెళ్లలేదింకా. గడువు పెట్టిన రోజు దాటి నెల రోజులైంది.

ఒక రోజు రామారావు శేఖరం చెప్పి రాజమండ్రి వెళ్లిపోయాడు. ప్రిన్స్‌పాల్‌ను కలుసుకొని తను ఏ పరిస్థితుల్లో చిక్కుకొన్నదీ, రాలేక పోవడానికి కారణాలూ చెప్పి తిరిగి జాయిన్ అయ్యాడు. కాని క్లాసులో పాఠాలు చెప్తున్నాడు. దానికీ, పాఠాలకూ సంబంధం కనిపించటంలేదు. ఒకొక్కప్పుడు క్లాస్ జరిగి ఇంకో పావుగంట అవనిదే రూమ్‌కు వెళ్లిపోయేవాడు.

విద్యార్థులల్లో కలవరం బయలుదేరింది. ప్రిన్సిపాల్‌కు ఈ లెక్చరర్ను గురించి కొన్ని రిపోర్టులు వెళ్లాయి. కొంతమంది ఉపాధ్యాయులు కూడా రామారావు సంగతి ఏమీ బావుండలేదని సలహాలిచ్చారు. మర్నాడే రామారావు ఉద్యోగంలోంచి తొలగించారు.

రామారావు విచారించలేదు. చంద్రశేఖరానికా విషయం రాయలేదు. కాని ఆ విషయం రాజమండ్రిలోని తన మిత్రుల ద్వారా తెలుసుకొని చంద్రశేఖరం బాధ పడ్డాడు.

శారద శ్యామును ముద్దుగా చూచుకొంటూ వుంది. శ్యాము శారదను "అమ్మా!" అంటూ ఎప్పుడూ ఆమె చంక నుంచి దిగడు. శారద తన పక్కలోనే శ్యామును పడుకోబెట్టుకొంటుంది. తల్లి లేని లోటు తీరుస్తూ వాణ్ని పెంచుతోంది.

చంద్రశేఖరం రామారావును రమ్మని రాశాడు. కాని రామారావు వెళ్లలేదు. రామారావు పూర్తిగా మరిచిపోయాడు.ఎక్కడా ఉద్యోగం కోసం ప్రయత్నించడం లేదు. అతని క్షేమసమాచారాలు శారద, శేఖర్‌లకు తెలియడం లేదు.

రామారావు తన హృదయానికి దూరమై పోతున్నట్లు మొదట కొన్నాళ్లు శారద బాధపడింది. రానురాను తన స్మృతిపథాన్నుంచి అదృశ్యమైపోతున్నాడు.

రామారావు మాత్రం శారదను మరిచిపోలేకపోయాడు. కాని వదిన మృతితో మతి స్థిరత్వాన్ని కోల్పోయింది. అటువంటి విషమపరిస్థితుల్లో చంద్రశేఖరం ఉత్తరం రాశాడు, తను శారదను వివాహం చేసుకోబోతున్నట్లుగా. అందుకు శారద అంగీకరించిందని కూడా రాశాడు.

ఒక్క సారి పిడుగు పడ్డట్లయింది రామారావుకు. జీవితంలో మధురస్వప్నాలు గాలిలోకి పొగల్లాగా అంతరించిపోయాయి. 'ఎంత మోసం?' అనుకొన్నాడు లోపల కాని, మరుక్షణమే ఆలోచించాడు. అవును, తననెందుకు ఆదరిస్తుంది? తనలో ఏముంది? తనిప్పుడు ఒక అధ్వానస్థితిలో ఉన్నాడు. తనెందుకలా అయిపోయాడో తనకే తెలియదు. జీవితంలో ఒంటరిగా పోతూ వున్న శారదను దరి చేర్చి ఆదరించిన చంద్రశేఖరానికి ఆ మాత్రం కృతజ్ఞత చూపకుండా ఉంటుందా? అని అనుకొన్నాడు. తేలిన హృదయంతో ప్రేమను తూచింది. తను సర్వవిధాలా నాశనం అయిపోయాడు. రామారావు

వారి వివాహానికి వెళ్లలేదు.

000

శారద తన జీవితంలో ఇప్పుడు మధురానుభూతుల్ని పొందగలుగుతోంది. అనేకవసంతాలు కాలగర్భంలో కలిసిపోయాయి. రామారావు జీవించి ఉన్నాడో లేదో వీరి కనవసరం అనిపించింది. రామారావును పూర్తిగా మరచారు.

రామారావు రాజమండ్రిని వదిలి వెళ్లలేదు. బట్టలన్నీ చిరిగిపోయాయి. పిచ్చివాడై రోడ్ల మీద తిరుగుతున్నాడు. తను చదువు నేర్పిన విద్యార్థులు, లెక్చరర్లు రోడ్డు మీద తనను హేళన చేస్తున్నారు. వీరిని చూచి ఒక చిరునవ్వు నవ్వుతాడు తాను. దాన్ని అర్థం చేసుకోగలిగినవాళ్లుంటే ఆ నవ్వే అతని హృదయాంతరాళాల్లో, రక్తంలో అంతర్లీనమై ప్రవహిస్తున్న బాధను సూచిస్తుంది. రామారావు ఈ ప్రపంచపు సాలిగూడు నుంచి బయటపడి దానితో ఏమీ సంబంధం లేనట్టు ప్రవర్తిస్తున్నాడు. అన్ని బంధాలనూ తెంచుకుని స్వేచ్ఛగా జీవిస్తున్నాడు. ప్రతి రోజూ శిథిలావస్థలోవున్న ఒక హోటలుకు వెళ్తాడు. అక్కడ సర్వర్స్‌కు రెండు ముక్కలు ఇంగ్లీషు చెప్పాడు. దానికి వారు మురిసిపోయి రెండు ముద్దలు వడేస్తూ వుంటారు. అమితానందంతో వాటిని స్వీకరించి కృతజ్ఞత చూపి వెళ్లిపోతాడు. జీవితంలో ఏదో అనుభవిద్దామన్న ఆశ ఏనాడో ఎండిపోయింది అతనిలో. చావలేక బతుకుతున్నాడు.

000

శ్యాము విశాఖపట్నంలో బి.ఏ. చదువుతున్నాడు. శ్యాము హృదయం వెన్న లాంటిది. అది వెన్నెలకే కరుగుతుంది. ఎంత చిన్న దీనమైన దృశ్యం చూస్తున్నా అతని మనసు విభిన్నమై పోతుంది.

ఒక సాయంత్రం బీచికి వెళ్లాడు. తన జీవితంలో ఎన్నడూ చూడని ఒక దృశ్యాన్ని చూస్తున్నాడు శ్యాము ఆ రోజున.

ఒక ముసలివాడు ఇసుకలో దొర్లుతూ సముద్రంలోకి చూస్తూ ఏదో ఆలోచిస్తున్నాడు. అతని వదనంలో ఏదో విషాదరేఖ స్పష్టంగా ద్యోతకమవుతోంది.

శ్యాము అతన్ని సమీపించాడు. ముసలాడు శ్యామును చూశాడు. ఎక్కడో చూసినట్లు గుర్తు... "గుడ్‌మార్నింగ్ సార్!" అన్నాడు ముసిలాడు శ్యామును చూస్తూ.

వీడెవడో బ్రతికి చెడిన రకం అనుకొని శ్యాము "ఏం బాబా! మీదీ వూరేనా? నీకెవరైనా ఉన్నారా?" అని అడిగాడు.

"బాబా!" ఎంత మధురంగా వినిపించిందా స్వరం! ఆ స్వరం ఎంతో మృదువుగానూ, ఏదో సన్నిహితస్వరంలానూ వినిపించింది ఆ ముసలాడికి. గత పాతికేళ్లలోనూ ఏ ఒక్కడూ తనను బాబా" అని పిలిచిన పాపాన పోలేదు. ఏ నాడో చనిపోయిన తను ఈ పిలుపు విని తిరిగి బ్రతుకుతాడు. ఒక్క సారి లేచి శ్యామును కావలించుకొన్నాడు.

శ్యాము అందుకు చీదరించుకోలేదు. ఆ ముసిలాడు శ్యాము స్పర్శకు ముగ్ధుడయ్యాడు. కాలి బూడిదైన తన జీవితంలో ఈ నాడు అమృతలహరులు ప్రవహిస్తున్నాయి. చైతన్యం లేక ఎక్కడికక్కడ కుళ్లిపోతూ వున్న శరీరంలో ఈ నాటికి రక్తకణాలు తిరిగి చలించడం ప్రారంభించాయి. శిలలా మారిన హృదయం ఈ స్పర్శకు తిరిగి స్పందించసాగింది. "బాబా!" అంటూ ఎప్పటి నుంచో అరుస్తున్న శ్యామును తనివితీరా ముద్దు పెట్టుకొన్నాడు.

"నాయనా! నా గాథ నీవు తెలుసుకొని ప్రయోజనం లేదు. నేనేనాడో అంతరించాను. కాని ఇంకా ఈ భౌతికదేహం మాత్రం మిగిలింది. ఈ మనుష్యులతో నాకు సంబంధం లేదు. నన్నిలా బ్రతికనియ్యి బాబూ!" అన్నాడు దీనంగా ముసిలాడు.

"నీ పేరేమిటి బాబా?" అన్నాడు శ్యాము క్షణం తర్వాత.

"ఒకొకప్పుడు ఈ మనుష్యులు నన్ను 'రామారా'వని పిలిచేవారు. కాని ఇప్పుడెవరూ పిలవరు. నేను కూడా ఆ పేరుని మరిచిపోయానేమో నని అనుమానం కల్గుతూ ఉంటుంది... అవును గాని నాయనా, మీ నాన్నగా రెవరు? ఏం జేస్తున్నారు?" అన్నాడా ముసిలాడు.

"మా నాన్న డాక్టర్ చంద్రశేఖరంగారు. చనిపోయి మూడేళ్లయింది. మా అమ్మకు నేనొక్కణ్నే" అంటూ చెప్పుకుపోతూ వున్న శ్యాము వైపు ఆ ముసిలాడు సంభ్రమాశ్చర్యాలతో చూస్తూ స్తబ్ధుడయ్యాడు. అన్నయ్య మరణించినందుకు లోపల దుఃఖించాడు. తన వదిన కొడుకును ఇన్నాళ్లకు కలుసుకొన్నాడు. కాని తనెవరో శ్యాముకు చెప్పదలుచుకోలేదు. ఏ జీవితంలో తను మోసపోయాడో, ఏ జివితం తనను సర్వనాశనం చేసిందో ఆ జీవితంలోకి తిరిగి వెళ్లడానికి తన కిష్టంలేక పోయింది.

శ్యాము ముసిలాడిని ఇంటికి రమ్మన్నాడు. కాని ముసిలా డందు కంగీరించలేదు.

"రేపు కూడా వస్తాను ఇక్కడే వుంటావు కదూ?" అన్నాడు శ్యాము.

"ఊ" అని మూలిగాడు ఆ ముసిలాడు.

శ్యాము ఇంటికి వెళ్లిపోయాడు.


"ఇంత ఆలస్యంగా వచ్చేవేరా ఇవాళ?" అంది శారద.

తను బీచిలో కలుసుకొన్న ముసలాడిని గురించి చెప్తూ, అతని పేరు "రామారావు" అని చెప్పాడు.

శారద హృదయంలోని వేదన అగ్నిపర్వతంలా బద్దలై ఒక్క సారిగా పెల్లుబికింది. రామారావు నానాడు తోసిపుచ్చింది కానీ ఈ నాడు అతని జీవితపరిణామాన్నీ, అతని పరిస్థితులనూ తెలుసుకుంటే ఆమెలో అమితమైన జాలీ, బాధా కలిగాయి. నాశనమైపోయిన అతని జీవితాన్ని తలచుకొంటే లోపల వున్న ఆవేదన కన్నీటి రూపంలో బహిర్గతమైంది.

శ్యాము తల్లిని చూసి కంగారుపడ్డాడు. శారద అతనికి అన్ని సంగతులూ వివరించింది.

ఆ ముసలాడు తన చిన్నాన్న అని తెలుసుకొన్న శ్యాము వెంటనే కారు వేసుకుని బయలుదేరాడు. బీచిలో ఒక్క మనిషి కూడా లేదు. అంతా వెదికాడు. రామారావు కనిపించలేదు. నల్లగా గంభీరంగా వున్న సముద్రంలోకి ఒక్కసారి చూచాడు, శ్యాము భయంతో.




'ఈ లోకంలో నాకేమీ సంబంధం లే'దన్నట్లు రోదిస్తోంది సముద్రం!

'రామారావు ఆత్మహత్య చేసుకోడు. చేసుకొనే ఉద్దేశమే ఉంటే ఇదివరకే ఏ నాడో మరణించి వుండేవాడు' అని అనుకొని మనసులో సంతృప్తి చెందుతూ గృహోన్ముఖుడయ్యాడు శ్యాము, విషాదహృదయంతో. ■